క్లుప్తంగా

గృహ నిర్మాణ పనులు పూర్తి చేయాలి



గృహనిర్మాణ జాబితాను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

పాలసముద్రం : గత ప్రభుత్వంలో మంజూరై సగంలో ఆగిపోయిన గృహ నిర్మాణ పనులు పూర్తి చేయాలని ఎంపీడీఓ కృష్ణమహేష్ రెడ్డి తెలిపారు. శనివారం హౌసింగ్ సిబ్బందితో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. గతంలో మంజూరైన 173 గృహ నిర్మాణాలు పనులు అసంపూర్తిగా ఉన్నాయని వాటిని త్వరలో పూర్తి చేయాలని కోరారు. పనులు చేస్తే లబ్ధిదారులకు సకాలంలో బిల్లులు వస్తాయని వివరించారు. అందువలన హౌసింగ్ సిబ్బంది 173 గృహ నిర్మాణాల లబ్ధిదారుల వద్దకు వెళ్లి త్వరలో భవన నిర్మాణం పూర్తి చేయాలని లేక పోతే బిల్లులు అందవని అవగాహన కల్పించి త్వరలో పూర్తి చేయించాలన్నారు.కార్యక్రమం లో హౌసింగ్ ఏఈ మధు, సూపర్‌వైజర్ బాబు పాల్గొన్నారు.

ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చర్యలు

విజయపురం : తుపాన్ ప్రభావంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహశీల్దార్ కిరణ్ పేర్కొన్నారు. శనివారం ఆయన మాట్లాడు తూ.. అత్యవసర పరిస్థితి ఉంటే తప్ప బయ టకు రాకూడదని హెచ్చరించారు. చెరువు, గట్లు, లోతట్టు ప్రాంతాల వైపు ఎవరూ వెళ్లకూ డదని, కరెంట్ స్తంభాలకు దూరంగా ఉండాల న్నారు. వర్షాలు విస్తృతంగా కురుస్తున్న నేప థ్యంలో రెవెన్యూ సిబ్బంది అప్రమత్తంగా ఉం డాలని అందరికీ సెలవులు రద్దు చేశామని తెలి పారు. వాగులు, వంకలు, చెరువుల వద్ద నీటి నిల్వ సామర్థ్యాన్ని పరిశీలిస్తూ పరిసర ప్రాం తాల ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చర్యలు తీసుకో వాలని ఆదేశించారు. ఏదైన ప్రమాదం జరిగినా వెంటనే విజయపురం రెవెన్యూ కం ట్రోల్ రూమ్ నంబర్‌కు 9666689468 ఫోన్ చేయాలని సూచించారు.

ఫ్లెక్సీ కూలి మహిళకు గాయాలు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలు



తలపైన తీవ్రగాయం

నగరి : నగరి పట్టణంలోని ఓంశక్తి ఆలయం వద్ద శనివారం రాత్రి 8 గంటల ప్రాంతంలో గాలీవానకు ఫ్లెక్సీ కూలి మీద పడటంతో అటువైపుగా వెళ్తున్న పట్టణానికి చెందిన అభి అనే మహిళ తీవ్రంగా గాయపడింది. వెంటనే ఆమె భర్త ప్రేమ్.. ఆమెను చికిత్స నిమిత్తం స్థానిక ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఆమె తలకు తీవ్ర గాయం కావడంతో వైద్య చికిత్స అందించి వైద్యుల పర్యవేక్షణలోనే ఆస్పత్రిలో ఉంచారు. వీరి స్వగ్రామం విజయపురం మండలం పన్నూరు కాగా కొంత కాలంగా నగరిలో నివాసం ఉంటున్నారు.

కాణిపాకం క్యాలెండర్ ఆవిష్కరణ

కాణిపాకం: శ్రీవరసిద్ధి వినాయక స్వామి వారి దేవస్థానం 2025 సంవత్సర నూతన క్యాలెండర్స్‌ను ఎమ్మెల్యే మురళీమోహన్ ఆవిష్కరించారు. చిత్తూరు నగరంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో శనివారం క్యాలెం డర్లను ఆవిష్కరించారు.

అన్నింటికీ ఆధారం

అన్నింటికీ ఇక ఆధార్ కార్డు ఆధారం అవుతోంది. పుట్టిన పిల్లల నుంచి వృద్ధుల వరకూ ప్రతి పనికీ ఆధార్ తప్పనిసరి చేస్తున్నారు. పాన్ కార్డు, బ్యాంక్ ఖాతా తదితరాలతో పాటు ప్రభుత్వ పథకాలకు దరఖాస్తు చేసుకోవాలంటే ఆధార్ కార్డు కచ్చితంగా ఉండాల్సిందే. అయితే ఆధార్ పొందిన ప్రతి ఒక్కరూ పదేళ్లకోసారి గుర్తింపు కార్డు, అడ్రస్ ప్రూఫ్‌ను సమర్పించి సెంట్రల్ ఐడెంటిటీస్ డేటా రెపాజిటరీ (సీఐడీఆర్)లో వివరాలు అప్‌డేట్ చేసుకోవాల్సి ఉంటుంది. ఈ సేవలను ఉచితంగా యూఐడీఏఐ కల్పిస్తోంది.

- పదేళ్లకోసారి అప్‌డేట్ తప్పనిసరి
- నిర్లక్ష్యం వహిస్తే సేవలు దూరం



ఆధార్‌లో పేర్లు, పుట్టిన తేదీ మార్పు కోసం ఇబ్బందులు పడుతున్న జనం

పాలసముద్రం : ప్రతి ఒక్కరికీ ఆధార్ ఉండాలని, అయిదేళ్ల కిందట తీసుకున్నవారూ నవీకరించుకోవాలని ప్రభుత్వం పదేపదే చెబుతున్నా చాలా మంది నిర్లక్ష్యం వహిస్తున్నారు. తీరా అవసరమైనప్పుడు ఆధార్ కేంద్రాలకు పరుగులు తీస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే సంక్షేమ పథకాలు పొందేందుకు ఆధార్ కార్డు తప్పనిసరి. ఆధార్‌లో పొరపాట్లు ఉంటే ఉద్యోగులు, వ్యాపారులకు ఇబ్బందులు తప్పవు. ప్రస్తుతం విద్యార్థులకు ఆధార్ నమోదు ప్రక్రియ చేపడుతున్నారు. దీంతో అత్యవసరంగా ఆధార్‌లో సవరణలు చేయించుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. కేంద్ర మానవ వనరుల మంత్రిత్వశాఖ విద్యార్థులందరికీ ఆపార్ నమోదు తప్పనిసరి చేయడంతో నియోజకవర్గ వ్యాప్తంగా ఈ ప్రక్రియ చేపడుతున్నారు.

డిసెంబర్ 14 వరకు అవకాశం

ఆధార్‌కు సంబంధించిన సేవలను ప్రజలకు అందించేందుకు అన్ని మండల కేంద్రాల్లో ఏర్పాటు చేసింది. పాలసముద్రం మండలంలో అన్ని సచివాలయాలు, ఉన్నతపాఠశాలల్లో ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. అయితే ఆధార్ కేంద్రాలు సక్రమంగా పనిచేయకపోవడంతో ప్రజలు సమస్యలు ఎదుర్కొంటున్నారు. పోస్టాఫీస్‌లో కూడా ఆధార్ సంబంధిత సేవలను పొందవచ్చునని ఇండియా పోస్ట్ తన వెబ్‌సైట్‌లో తెలిపింది. ఆధార్ వివరాలను పదేళ్లకోసారి అప్‌డేట్ చేసుకోవాలని యూఐడీఏఐ గతంలో ప్రకటించింది. అప్పటి నుంచి పలుమార్లు గడువు పొడిగిస్తూ ఈ ఏడాది డిసెంబర్ 14వ తేదీ వరకు అవకాశం ఇచ్చింది. అంతేకాకుండా ఆధార్‌లో చిన్న మార్పులు చేసుకోవాల్సిన వారు కూడా చేసుకోవచ్చునని తెలిపింది. కార్డుదారు పేరు, పుట్టిన తేదీ, చిరునామా వంటి అంశాల్లో మార్పులు చేర్పులు చేసుకోవచ్చు.



జూనియర్ కళాశాలల్లో నిర్వహించిన ఆధార్ క్యాంప్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

జనన ధ్రువీకరణ పత్రాలకు ఇక్కట్లు



ఆధార్‌లో తప్పులను సవరించుకోవడానికి, అవసరమైన జనన ధ్రువీకరణ పత్రాల కోసం అగచాట్లు పడుతున్నారు. గతంలో మంజూరు చేసిన జనన ధ్రువీకరణ పత్రాలు ఉన్నా అందులో తప్పుల కారణంగా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు రెవెన్యూ కార్యాలయం ద్వారా జనన ధ్రువీకరణ పత్రాలు పొందగా, వాటిలో వివరాలు చేతిరాతతో ఉన్నందున ఆధార్ వివరాల మార్పునకు అంగీకరించడం లేదు. అందువలన విద్యార్థుల ఆధార్లు మార్పు, చేర్పులకు సమయం ఎక్కువ పడుతోంది.

– ఉమ, శ్రీకావేరిరాజుపురం, ఆదిఆంధ్రవాద

సమయం పొడిగించాలి



ప్రభుత్వ పథకాలు వర్తించాలంటే ఆధార్ అప్‌డేట్ తప్పనిసరి అని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెబుతున్నాయి. డిసెంబర్ 14వ తేదీ వరకు అవకాశం ఉందంటున్నారు. పుట్టిన తేదీ తప్పులుంటే సర్టిఫికెట్ తీసుకోవాలంటే కనీసం 15 రోజులు పడుతోంది. సర్టిఫికెట్ తీసుకొచ్చి ఆధార్ కేంద్రాలకు వెళ్తే సర్వర్ పని చేయలేదని ఒకటి, రెండు రోజులు అవుతోంది. ఆపై అప్‌డేట్ చేస్తే వారం రోజులు అయిన తరువాత ఆధార్ కార్డులో మార్పులు చేర్పులు అవుతున్నాయి. ఆధార్ అప్‌డేట్ సమయం పొడిగిస్తే ఇబ్బందులు తప్పుతాయి.

– త్యాగరాజ్, ఏట్టుకూరిపల్లె

అవకాశం సద్వినియోగం చేసుకోండి



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే పథకాలను పొందేందుకు ఆధార్ కార్డు తప్పనిసరి. ఆధార్ చేయించుకొని పదేళ్లు పూర్తి అయిన వారు అప్‌డేట్ చేయించుకోవాలి. సాంకేతిక తప్పిదాలుంటే సరి చేసుకోవాలి. ఇలా చేయకపోతే అర్హులు సైతం సంక్షేమ ఫలాలు పొందలేరు. ఆధార్ అప్‌డేట్ చేసుకునేందుకు అన్ని సచివాలయాలు, హైస్కూల్‌లో ఆధార్ కేంద్రాలు అందుబాటులో ఉన్నాయి. వాటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.

– కృష్ణమహేష్ రెడ్డి, పాలసముద్రం, ఎంపీడీఓ

హెల్ప్‌లైన్ వినియోగించుకోండి



నేసనూరు వాగును పరిశీలిస్తున్న కమిషనర్

పుత్తూరు : మరో రెండు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ప్రజలు ఇళ్లకే పరిమితం కావాలని మున్సిపల్ కమిషనర్ శనివారం ఒక ప్రకటనలో కోరారు. పట్టణ పరిధిలోని లోతట్టు ప్రాంతాలైన భవానీనగర్ వద్ద గల ఉప్పుకాల్వ, నేసనూరు వద్ద గల వాగు పొంగి పొర్లుతున్నాయని, వాహనాలు వెళ్లకుండా బారికేడ్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. శిథిలావస్థకు చేరిన భవనాల్లో ఉండకుండా సురక్షిత ప్రాంతాల్లోకి వెళ్లవలసిందిగా సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో పుత్తూరు పురపాలక సంఘంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందించాలని కోరారు. పర్యవేక్షణాధికారులుగా నియమించిన ఏఈ కార్తికేయన్ 99890 24127, శానిటరీ ఇన్స్‌పెక్టర్ 91605 09472లకు ఫోన్ చేసి సంప్రదించాలని కోరారు. సమాచారం అందిస్తే మున్సిపల్ సిబ్బంది వెంటనే సహాయక చర్యలు చేపట్టడం జరుగుతుందని స్పష్టం చేశారు.

నీటమునిగిన పంటలు



పాలసముద్రం : ఏట్టుకూరిపల్లెలో గాలి వానకు నేలవాలిన వరి

పాలసముద్రం : ఫెంగల్ తుపాన్ దెబ్బతో వరి, అరటి, చెరకు పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. మండలంలో తొట్టికండ్రిగ, గంగమ్మంబపురం, వెంగళరాజుకుప్పంలో సుమారు అయిదెకరాల అరటి తోటలు గాలికి నేలకూలాయి. శ్రీకావేరిరాజుపురం, కేజీ పురం, పాలసముద్రం, ఆముదాల, బాలక్రిష్టాపురం, నరసింహపురం గ్రామాల్లో సుమారు 20 ఎకరాల్లో వరిపంట నీట మునిగింది. పంట చేతికందే సమయంలో తుపాన్ దెబ్బతో పంట నేలపాలు కావడంతో రైతులు కుదేలవుతున్నారు.

నింద్ర : మండలంలో తుపాను ప్రభావంతో వరినాట్లు నీట మునిగి పోయాయి. మండలంలోని పలు చెరువుల్లో నీరు చేరింది. వేరుశెనగ పంట పొలాల్లో నీరు చేరింది. పలు గ్రామాల్లో వర్షాలకు రోడ్లు గుంతలుగా మారాయి.

వడమాలపేట (విజయపురం) : తుపాన్ ప్రభావంతో శనివారం వడమాలపేట, విజయపురం మండల వ్యాప్తంగా ముసురు వాన కురిసింది. వడమాలపేటలో 88 మి.మీ. విజయపురంలో 66.2 మి.మీ.వర్షపాతం నమోదైంది. ఎడతెరపి లేకుండా కురిసిన వర్షానికి సాగు చేసిన వేరుశెనగ, మినుము, వరి, పంటలు నీటి మునిగాయి.





నింద్ర : అగరంలో నీట మునిగిన వరి, విజయపురంలో కలుజు పోస్తున్న పాత ఆర్కాడు చెరువు

కంట్రోల్ రూమ్‌ల ఏర్పాటు

నగరి : ఫెంగల్ తుపాను నేపథ్యంలో ప్రత్యేక కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసినట్లు ఆర్డీఓ వై.భవానిశంకరి తెలిపారు. శనివారం నుంచి డిసెంబరు 2వ తేదీ వరకు భారీ వర్షాలు కురిసే సూచనలు ఉన్నట్లు వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేయడంతో ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నామన్నారు. కంట్రోల్ రూమ్ నుంచి పూర్తి స్థాయిలో పర్యవేక్షణ చేపడుతామన్నారు. ఆదివారం డీటీ గౌరీశంకర్, నింద్ర వీఆర్‌ఏ భూపాల్ కంట్రోల్ రూమ్‌లో ఉంటారని 94918 03680 నంబర్లు సంప్రదించవచ్చన్నారు. 2వ తేదీన డీటీలు రూపశ్రీ లక్ష్మి, విజయరెడ్డి, సీనియర్ అసిస్టెంట్ భూదేవి పర్యవేక్షిస్తారని 95025 27667 నంబర్లు సంప్రదించవచ్చన్నారు. వర్షాల కారణంగా ఎక్కడ ఏ అవాంతరాలు జరిగినా కంట్రోల్ రూమ్‌ను సంప్రదించాలన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో 28 మందికి జరిమానా

చిత్తూరు అర్బన్: మద్యం తాగి వాహనాలు నడిపిన 28 మందికి రూ.2.80 లక్షల జరిమానా విధిస్తూ చిత్తూరులోని ప్రిన్స్‌పల్ జూనియర్ సివిల్ జడ్జి ఉమాదేవి శనివారం తీర్పునిచ్చారు. చిత్తూరు ట్రాఫిక్ సీఐ నిత్యబాబు గత రెండు రోజులుగా వాహనాలు తనిఖీ చేస్తుండగా పలువురు మద్యం సేవించి వాహనాలు నడుపుతున్నట్లు గుర్తించారు. మొత్తం 28 మందిపై కేసు నమోదు చేసి, కోర్టులో హాజరుపరిచారు. ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున మొత్తం రూ.2.70 లక్షల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. కాగా గత 11నెలల వ్యవధిలో చిత్తూరు ట్రాఫిక్ పోలీసులు మద్యం సేవించి వాహనాలు నడిపిన 568 మందిపై కేసులు నమోదుచేస్తే.. న్యాయస్థానం రూ.56.90 లక్షల జరిమానాలు విధించిందని సీఐ నిత్యబాబు తెలిపారు.

అధికారులు అందుబాటులో ఉండాలి

నింద్ర : తుపాను నేపథ్యంలో మండలంలోని వివిధ శాఖల అధికారులు అందుబాటులో ఉండాలని తహసీల్దారు శేషగిరిరావు పేర్కొన్నారు. శనివారం మండల అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని వివిధ శాఖల అధికారులు మండల కేంద్రంలోనే ఉండాలని , అదే విధంగా సచివాలయ సిబ్బంది, వీఆర్‌ఓలు వారి పరిధిలోనే ఉండాలని ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి సమస్య లేకుండా చూడాలని కోరారు. అనంతరం కావునూరు, అత్తూరు గ్రామాల వద్ద వున్న కాజ్‌వేను పరిశీలించారు. నీరు గ్రామాలపై రాకుండా చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ అధికారులతో సమీక్షించారు. అనంతరం మండల కేంద్రంలోని బీసీ హాస్టల్‌ను పరిశీలించారు. దుప్పట్లు లేని విద్యార్థులకు నూతన దుప్పట్లు పంపిణీ చేశారు. తుపాను కారణంగా ప్రజలు ఇబ్బందులు పడకుండా 94415 28712, 94910 77036 కంట్రోల్ నంబర్లకు సమాచారం ఇవ్వాలని తహసీల్దారు శేషగిరిరావు కోరారు.

ఎయిడ్స్‌పై అవగాహన

కార్వేటినగరం : ఎయిడ్స్ వ్యాధికి మందు లేదని, అప్రమత్తతే ఆయుధమని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ విజయులురెడ్డి పేర్కొన్నారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ.. ఎయిడ్స్ పట్ల యువత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్, రెడ్ రిబ్బన్ క్లబ్, యూత్ రెడ్ క్రాస్ సొసైటీ, ఎన్‌సీసీ సంయుక్తంగా మానవ హారం ఏర్పాటు చేసి ఎయిడ్స్ నివారణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అధ్యాపకులు ధనుంజయరెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



కార్వేటినగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థుల



పెనుమూరు జూనియర్ కళాశాలలో అవగాహన కల్పిస్తున్న అధ్యాపకులు

రక్తం ద్వారానే ఎయిడ్స్ వ్యాప్తి

కార్వేటినగరం : రక్తం ద్వారానే ఎయిడ్స్ ఒకరి నుంచి మరొకరికి వ్యాప్తి చెందుతుందని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ శారద అన్నారు. శనివారం పెనుమూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రపంచ ఎయిడ్స్ దినం సందర్భంగా మండల కేంద్రంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ పీఓ ప్రసాద్, అధ్యాపకులు ఉమాపతి, ఆంజనేయులు, చంద్రబాబు, కళావతి, శకుంతల, మురగన్ పాల్గొన్నారు.

క్రీడా జ్ఞాన పరీక్షలు సద్వినియోగం చేసుకోండి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా ఆసక్తి ఉన్న క్రీడాకారులు క్రీడా జ్ఞాన పరీక్షలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి బాలాజీ తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. క్రీడాభారతి ఆధ్వర్యంలో ఆన్‌లైన్ విధానంలో పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ఈ పరీక్ష ఈ నెల 8వ తేదీన ఉదయం 5 నుంచి సాయంత్రం 5 గంటల మధ్య ఏదో ఒక సమయంలో నిర్వహిస్తారని చెప్పారు.

ముగిసిన త్రోబాల్ పోటీలు

కాణిపాకం: పూతలపట్టు మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న రాష్ట్ర స్థాయి అండర్–14 త్రోబాల్ పోటీలు శనివారంతో ముగిశాయి. ఈ పోటీల్లో సాయంత్రం వరకు నువ్వా? నేనా? అన్నట్లు పలు జట్లు తలపడి ప్రతిభ కనబరిచాయి. బాలుర జట్టులో చిత్తూరు సత్తా చాటి ప్రథమ స్థానంలో నిలిచింది. ద్వితీయస్థానంలో వైఎస్సార్ కడప, అలాగే బాలికల జట్టులో చిత్తూరు మొదటిస్థానం, రెండో స్థానంలో కర్నూలు నిలిచింది. విజేత జట్లకు అధికారులు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి వసంతవాణి, పీడీలు తదితరులు పాల్గొన్నారు.

బాలబడి.. పోషకాల ఒడి

- అంగన్‌వాడీల్లో కిచెన్ గార్డెన్ల నిర్వహణ
- నాటి ప్రభుత్వ దారిలోనే సేంద్రియ సాగు
- గర్భిణులు, చిన్నారులకు తాజా కూరగాయలు

పుత్తూరు : అంగన్‌వాడీ కేంద్రాల్లో సేంద్రియ పద్ధతుల్లో కూరగాయలను పండించి గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు మంచి పోషణ అందించాలనే నాటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ఆలోచన నేడు మంచి సత్ఫలితాలిస్తోంది. అంగన్‌వాడీ కేంద్రాల్లో కిచెన్ గార్డెన్లను కార్యకర్తలు క్రమం తప్పకుండా పరిరక్షిస్తూ కొనసాగించడంతో తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కొన్నేళ్లుగా మార్కెట్‌లో లభించే కూరగాయల్లో రసాయన ఎరువులు, క్రిమిసంహారక మందులతో పండించిన కూరగాయలే అందుబాటులో ఉంటున్నాయి. వీటివల్ల దీర్ఘకాలంలో అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో గత ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల్లో కిచెన్ గార్డెన్ల కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. అవకాశం ఉన్న ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో సేంద్రియ ఎరువులతో కూరగాయలు, ఆకుకూరలు పండించి అందజేయాలన్నదే కిచెన్ గార్డెన్ల ప్రధాన లక్ష్యం. అందుకు అనుగుణంగా పుత్తూరు పరిధిలో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు సేంద్రియ పద్ధతుల్లో సాగు చేసిన తాజా కూరగాయాలు, ఆకుకూరలు సాగు చేసి అందిస్తున్నారు. వీరిలో పోషణ స్థాయిని పెంచి, రక్తహీనత నివారణకు కృషి చేస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో కిచెన్ గార్డెన్ల బాధ్యతను కార్యకర్తలే ఎంతో ఉత్సాహంగా నిర్వహిస్తుండడం విశేషం. పుత్తూరు ఐసీడీఎస్ పరిధిలోని పుత్తూరు రూరల్‌లో 43, అర్బన్‌లో 43, వడమాలపేటలో 43, మొత్తం 129 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో గర్భిణులు 642, బాలింతలు 644, మూడేళ్లలోపు పిల్లలు 3,969, మూడు నుంచి ఆరేళ్ల పిల్లలు 1,537 మంది ఉన్నారు. దాదాపు అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో పెరటి తోటలు కళకళలాడుతున్నాయి.



చౌటూరులో వంగ తోటను పరిశీలిస్తున్న సూపర్‌వైజర్ గీతాంజలి



తిరుమణ్యం కేంద్రంలో బీరకాయలు కోస్తున్న కార్యకర్త

కార్యకర్తలే కర్షకులు

అంగన్‌వాడీ కార్యకర్తలే కర్షకులుగా కిచెన్ గార్డెన్లను నిర్వహిస్తున్నారు. కేంద్రాల వద్ద ఖాళీ స్థలాల్లో ఆకు కూరలు, కూరగాయలను కార్యకర్తలే సాగు చేస్తూ ఆదాయం , ఆరోగ్యాన్ని అందిస్తున్నారు. బెండ, వంగ, మిర్చి, టమోట, బీర, సొర వంటి కూరగాయలతో పాటు పాలకూర, మెంతి, చుక్క, తోట వంటి ఆకు కూరలను సాగుచేస్తూ అందరికి ఆదర్శంగా నిలుస్తున్నారు.

అందరి సహకారం

పుత్తూరు ఐసీడీఎస్ పరిధిలో మొత్తం 129 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. దాదాపు అవకాశం ఉన్న ప్రతి అంగన్‌వాడీ కేంద్రం లోనూ కిచెన్ గార్డెన్‌ను నిర్వహిస్తున్నాం. ఈ కార్యక్రమం అందరి సహకారంతో ముందుకు సాగుతోంది. ప్రతి కార్యకర్త ఎంతో ఆసక్తిగా నిర్వహించడం సంతోషించదగ్గ విషయం. తాజా కూరగాయలు, ఆకుకూరలను పండిస్తున్నాం.

– సంధ్య, ఇన్‌చార్జి సీడీపీఓ, పుత్తూరు

హోరుగాలి.. జోరువాన



టీవీ కండ్రిగ వద్ద పొలాల్లో వర్షపు నీరు



నగరిపేటలో వీధుల్లో పారుతున్న వర్షపు నీరు

- జలమయమైన లోతట్టు ప్రాంతాలు
- నేలకూలిన చెట్లు, ఫ్లెక్సీలు
- పొంగిపొర్లుతున్న వాగులు

నగరి : ఫెంగల్ తుపాను నియోజకవర్గంలో ప్రతాపం చూపింది. శనివారం నగరిలో 9 సెం.మీ., నింద్ర 3, విజయపురంలో 4 సెం.మీ. చొప్పున వర్షపాతం నమోదైంది. ఉదయం నుంచి రాత్రి వరకు పెద్ద ఎత్తున ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. పలు ప్రాంతాల్లో చెట్లు, విద్యుత్ స్తంభాలు, ఫ్లెక్సీలు నేలకొరిగాయి. సమయానికి రోడ్డుపై ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. తచ్చూరు హైవేలో నెంబరు 66 వద్ద పొలాల పక్కనే రివిట్‌మెంట్ వాల్ కట్టేయడంతో చెరువుకు నీరు పోయే కాలువ మూసుకుపోవడంతో చెరువుకు వెళ్లాల్సిన నీరు పంట పొలాలపై ప్రవహించింది. నాలుగు రోజులు ముందు వేసిన చెరకు పంట పూర్తిగా నీటమునిగింది. దీంతో రూ.35 వేలు నష్టపోయినట్లు రైతు మునస్వామిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. గుండ్రాజుకుప్పం వద్ద విద్యుత్ స్తంభం నేలకొరగడంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. వర్షంతో పాటు వణికించే ఈదురుగాలుల ప్రభావంతో జన జీవనం స్తంభించిపోయింది.

పుత్తూరులో 112.6 మి.మీ. వర్షం

పుత్తూరు : తుపాన్ ప్రభావంతో పుత్తూరులో 112.6 మి.మీ వర్షపాతం నమోదు అయింది. వాగులు వంకలు పొంగిపొర్లుతున్నాయి. నేసనూరు కాజ్‌వేపై ఉధృతంగా నీరు ప్రవహిస్తుండడంతో పైడిపల్లి, గోపాలకృష్ణపురానికి రాకపోకలు స్తంభించాయి. మున్సిపాలిటీ 4వ వార్డులో లోతట్టు ప్రాంతం ఎప్పుడు వర్షాలు పడినా ముంపునకు గురయ్యేది. గత ఏడాది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో భవానీనగర్‌లోని కాలువను బాగు చేయడంతో ఇబ్బందులు తప్పాయి. భవానీనగర్ కింది భాగంలో ఉన్న 6వ వార్డుకు చెందిన తాయిమాంబాపురం చెరువు కలుజు పారుతోంది. ఇక్కడి కల్వర్టును సైతం గత ప్రభుత్వం బాగు చేయడంతో కలుజు నీరు సజావుగా సాగిపోతోంది.



భవానీనగర్ ఉప్పుకాల్వ వద్ద వరద ఉధృతి



నేసనూరు కాజ్‌వేపై పొంగిపొర్లుతున్న ప్రవాహం